క్లుప్తంగా

ప్రవేశాలకు దరఖాస్తులు

జి.సిగడాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2023–24 సంవత్సరానికి 6వ తరగతి సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 9వ తేదీ నుంచి 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు ఫీజు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75, బీసీ, ఓసీ విద్యార్థులకు రూ.150 లు ఉంటుందని తెలిపారు.

రణస్థలం: స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిత్యావసర సరుకుల పంపిణీపై ఆరా



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటరమణ

గార: చౌకధరల దుకాణాల ద్వారా అందుతున్న బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పిండి సరుకుల నాణ్యత, పంపిణీపై డీఎస్‌ఓ వెంకటరమణ క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. శుక్రవారం శ్రీకూర్మం పంచాయతీ తండ్యాలపేట డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, ధరలు, వాహన వేళలు, తూకం తదితర అంశాలపై ఆరా తీశారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత



జనార్దనరావు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా హోంగార్డు విభాగానికి చెంది శ్రీకాకుళం యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తూ గత నెలలో అనారోగ్యంతో మరణించిన టి.జనార్దనరావు కుటుంబానికి ఎస్పీ జి.ఆర్. రాధిక రూ.4.25 లక్షల చెక్కును శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. హోంగార్డులు తమ ఒక్కరోజు వేతనాన్ని ఇలా సమకూర్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని, శాఖాపరంగా రావాల్సిన మిగతా ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

సంతోషిమాతకు పూజలు



అలంకరణలో సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో సంతోషి మాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు చేసి ఉద్యాపనలు, మహానివేదన, మహా హారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న జీఎస్‌టీ చీఫ్ కమిషనర్



చీఫ్ కమిషనర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జీఎస్‌టీ అండ్ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈఓ హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు శంకరశర్మ గౌరవ స్వాగతం పలుకుతూ అంతరాలయ దర్శనం చేయించారు.

దేవీ ఆశ్రమంలో అభిషేకాలు



ఎచ్చెర్ల: మండలంలో కుంచాల కుర్మయ్యపేట గ్రామంలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి బాల భాస్కరశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి క్షీరాభిషేకాలు, పాలాభిషేకాలను నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- డి.మత్స్యలేశం పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం పంచాయతీ పరిధి డి.మత్స్యలేశం, రాళ్లపేట గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఉత్తరాంధ్ర ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విశాఖపట్నంలో పాలనా రాజధాని ఏర్పాటు, భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నిర్మాణం, భావనపాడులో పోర్టు, బుడగుట్లపాలేంలో ఫిషింగ్ హార్బర్ వంటి నిర్మాణాలతో ఉత్తరాంధ్ర స్వరూపం మారుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, పీఆర్ ఏఈ సూర్యచంద్ర, సర్పంచ్ మూగి ఈశ్వరి, ఎంపీటీసీ చోడిపల్లి వలసమ్మ, నాయకులు సనపల నారాయణరావు, మూడి శ్రీరాములు, పైడి భాస్కరరావు, మురళీధర్ బాబా, రామారావు, కృష్ణమూర్తి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌కుమార్

లావేరు: సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ సూచించారు. మండలంలోని గుమడాం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై సమీక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ సక్రమంగా అందాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఉప సర్పంచ్ దురగాసి ధర్మారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు జగ్గురోతు తవిటినాయుడు, నాగం కనకరాజు, ముప్పిడి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిరణ్ పరామర్శ

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని డి.మత్స్యలేశం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు మూగి రాములమ్మ, మూగి స్వామిరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాలను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఆటవిడుపు



లాఫ్ అండ్ లెర్న్‌లో పాల్గొన్న పెద్దలు

శ్రీకాకుళం కల్చరల్ : ప్రతిచోటా చిన్నారులకు వేసవి సందర్భంగా పలు రకాల శిక్షణ అందించడం సాధారణమేనని, ఈ ఏడాది కొత్తగా సీనియర్ సిటిజన్ల కోసం వేసవి వినోదంగా ఆనందలహరి పేరుతో లాఫ్ అండ్ లెర్న్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సూర్యపతంజలి యోగా కేంద్రం నిర్వాహకులు కె. శ్రీదేవి తెలిపారు. ఆటపాటలు, వ్యాయామాలు చేయిస్తున్నామని చెప్పారు. వీటివల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. చంద్రమహల్ ఎదురుగా ఉన్న సూర్యపతంజలి యోగా కేంద్రంలో ఉచితంగా నేర్పుతున్నామని తెలిపారు. పూర్తి వివరాలకు 7702953622 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

రుణాల రికవరీలో ముందంజ

- జిల్లా స్త్రీనిధి ఏజీఎం సత్యనారాయణ



మాట్లాడుతున్న ఏజీఎం సత్యనారాయణ

జి.సిగడాం: స్త్రీ నిధి రుణాల మంజూరు, రికవరీలో రాష్ట్రస్థాయిలోనే శ్రీకాకుళం జిల్లా ముందంజలో ఉందని జిల్లా స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) వాక సత్యనారాయణ వెల్లడించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో గ్రామ సంఘాల సభ్యులు, సీఎఫ్‌లతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 38వేల మంది మహిళా సంఘ సభ్యులకు రుణాలను అందించామన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.167 కోట్లు లక్ష్యంగా కాగా, ఇప్పటికే రూ.19 కోట్లను అర్హులైన సభ్యులకు రుణాల రూపంలో అందించామని తెలియజేశారు. స్త్రీనిధి రుణాలు అవసరమైన సభ్యులు గ్రామ వీఏలకు సమాచారం ఇస్తే 48 గంటల్లోనే రుణాన్ని సంబంధిత బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. రుణాలు తీసుకున్న ప్రతి సభ్యునికీ సురక్షిత బీమా పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు.రుణాల మంజూరులో గ్రామ సంఘం గ్రేడులను పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ఏ–గ్రేడ్ సంఘానికి రూ.75 లక్షలు, బీ–గ్రేడ్ సంఘానికి రూ.65 లక్షలు, సీ–గ్రేడ్ సంఘానికి రూ.55 లక్షలు, డీ–గ్రేడ్ సంఘానికి రూ.45 లక్షల చొప్పన రుణాలను అందిస్తామన్నారు. ఈ ఏడాది జి.సిగడాం మండలానికి రూ.5 కోట్ల రుణాలు లక్ష్యం కాగా, ఇప్పటికే రూ.60 లక్షలు అందించామని తెలియజేశారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఎచ్చెర్ల క్లస్టర్ అధికారి కె.ఉదయ్‌కుమార్, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలో నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శారద

జి.సిగడాం: మొక్కజొన్న పంటను రైతులు విక్రయించేందుకు ఈనెల 12వ తేదీలోగా సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి యర్రా శారద సూచించారు. మండలంలోని పెంట ఆర్బీకే కేంద్రంలో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్బీకేల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ఇప్పటికే అర్హులైన రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులకే ప్రభుత్వం రాయితీతో పాటు మద్దతు ధర కల్పిస్తుందన్నారు. సమావేశంలో సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత, వైఎస్సార్‌సీపీ నాయకుడు పున్నాన అక్కలనాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కుసుమ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సింగుపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు సుంకాన మహాలక్ష్మికి డీఆర్‌డీఏ ఏఓ బి.వి.వి.ఎస్ దొర ఆధ్వర్యంలో శుక్రవారం పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సింగుపురం పరిధిలో రూ.3,10,402 (98 శాతం) మేర పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

బుద్ధుడి బాట..మానవజాతికి పూదోట



గాంధీ మందిరంలో బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: బుద్ధుని బాటను మానవజాతి అనుసరించడం ద్వారా సమస్యల సుడిగుండం నుంచి బయటపడి ప్రశాంత జీవనం పొందవచ్చని ప్రముఖ వైద్యులు డాక్టర్ పి.ఎల్.ఎస్.రాజు అన్నారు. బుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలో గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు స్మృతివనంలో గౌతమబుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మందిర కమిటీ కో–కన్వీనర్ వావిలపల్లి జగన్నాథంనాయుడు మాట్లాడుతూ జిల్లాలో బౌద్ధం వర్ధిల్లిన చరిత్ర ఉందన్నారు. కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు నిక్కు అప్పన్న, డాక్టర్ జామి భీమశంకరరావు, నటుకుల మోహన్, బరాటం లక్ష్మణరావు, కొంక్యాన వేణుగోపాల్, మహిబుల్లాఖాన్, పందిరి అప్పారావు, మెట్ట అనంతం భట్లు, నక్క శంకరరావు, పొన్నాడ రవికుమార్ తదితరులు ఉన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని విశాఖ–బి కాలనీలో గౌతమబుద్ధుని విగ్రహం వద్ద కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యావేత్త డాక్టర్ జామి భీమశంకర్ మాట్లాడుతూ కొంక్యాన ట్రస్టు ఆధ్వర్యంలో బుద్ధ విగ్రహాన్ని, గౌతమ్ నగర్ మినీ పార్క్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సెయింట్ జ్యాడ్స్ ప్రిన్సిపాల్ బుంగా చంద్రమోహన్, బుద్ధ విగ్రహ కమిటీ ప్రతినిధులు నేరెళ్ల సత్యనారాయణ, కోడిశ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి పూజలు



సిరిజ్యోతి పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా సిరిజ్యోతి పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురుజీ ఆధ్వర్యంలో మహిళలంతా కలిసి శ్రీచక్రం వద్ద జ్యోతులు వెలిగించారు. గోవిందనగర్ కాలనీలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శ్రీచక్ర అర్చనలు ఘనంగా జరిగాయి. అర్చకులు ధర్మపురి గౌరీ శంకరశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొదలవలస ఉషారాణి, జగన్మోహనరావు, అర్చకులు బంకుపల్లి చరణ్‌శంకరశర్మ, ఎం.శ్రీనివాసశర్మ జి.వేణుగోపాల్, రేణుక, సుధీర్‌కుమార్, రుద్రాణి పాల్గొన్నారు.

రూ. 2.82 కోట్లతో జల్‌జీవన్ పనులు



జల్‌జీవన్ మిషన్ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.2.82 కోట్లతో శరవేగంగా జల్‌జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ తెలియజేశారు. సర్వేశ్వరపురం, జీడీపాలెం గ్రామాల్లో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులను శుక్రవారం వారు పరిశీలించారు. పనులు పూర్తయితే తాగునీటి ఇబ్బందులు తొలగుతాయన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. వీరితో పాటు సర్పంచ్ చందక సతీష్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బూరాడ వెంకటరమణ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి ఉన్నారు.

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న వేణుగోపాలరావు

జి.సిగడాం: గ్రామాల్లో రైతులకు నెలకొన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో, సర్వేయర్లతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో ఆన్‌లైన్ ద్వారా భూహక్కు పత్రాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొన్ని గ్రామాల్లో భూరికార్డులు సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటిపై ప్రత్యేక దృష్టి సాధించామని పేర్కొన్నారు. కొన్నింటికి కోర్టులో కేసులు ఉండడంతో పరిష్కారం సాధ్యం కాదన్నారు. రబీ సీజన్ కావడంతో రైతులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేసేందుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. వన్–బీ రాకపోతే తక్షణమే ఆ గ్రామ వీఆర్వోకు లేదా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ నిర్మల, హనుమంతురావు, ఆర్‌ఐ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి జింక

పాతపట్నం: పాతపట్నం నగరంలోని ఆల్‌ఆంధ్రరోడ్డుపైకి శుక్రవారం చుక్కల జింక చొరబడటంతో యువకులు పట్టుకుని ఫారెస్టు అధికారులకు అప్పగించారు. జోగి కొండ దిగువ నుంచి ఆల్‌ఆంధ్ర రోడ్డు పరిసరాల్లోకి దిగిన జింకను కుక్కల గుంపు వెంటాడుతుండడంతో స్థానిక యువకులు చేరదీశారు. అనంతరం ఫారెస్టు బీట్ అధికారి కె.లక్ష్మినారాయణ, సిబ్బందికి అప్పగించారు. వారు జింకను ద్విచక్రవాహనంపై తమ కార్యాలయానికి తీసుకువెళ్లారు. అటవీశాఖ రేంజర్ రాజశేఖర్ ఆదేశాల మేరకు అడవిలోకి విడిచిపెట్టామని ఎఫ్‌బీఓ తెలిపారు. కాగా, కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో వన్యప్రాణులు ముఖ్యంగా జింకలు జనావాసాల్లోకి వస్తున్నాయని, కొన్నిసార్లు కుక్కల బారిన పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

● కమనీయం.. శివపార్వతుల కల్యాణం



రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడులో ఉమా సహిత కాశీవిశ్వేశ్వర ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శివ పార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామపురోహితులు మావుడూరి మోహనశర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం మూడు వేల మందికి అన్నదానం చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. –గార

వాలీబాల్ విజేత చెట్టుపొదిలాం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అప్పలనాయుడు తదితరులు

లావేరు: మండలంలోని లుకలాపు యువసేన ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లుకలాపు అప్పలనాయుడు సౌజన్యంతో నిర్వహించిన వాలీబాల్ ఫైనల్స్ వెంకటాపురం గ్రామంలో శుక్రవారం జరిగాయి. ఫైనల్‌లో జి.సిగడాం మండలంలోని చెట్టుపొదిలాం, పొందూరు మండలంలోని లోలుగు గ్రామాల జట్లు తలపడగా, చెట్టుపొదిలాం జట్టు విజయం సాధించింది. విజేతలకు అప్పలనాయుడు చేతుల మీదుగా ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజరు సురేష్, మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, పీఈటీ జి.గోపాల్, వార్డు మెంబరు ఇప్పిలి కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు తేనెల సురేష్‌కుమార్, మీసాల త్రినాథరావు, వాళ్లే పెదదాలినాయుడు, జగ్గురోతు రాము, పిన్నింటి సూర్యారావు, మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు, చందక నాగరాజు, వాళ్లే సాయిరాం, అప్పలరాములు, లావేరు హైస్కూల్ పీఎంసీ చైర్మన్ లంకలపల్లి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూర్మనాథునికి అవభృథ స్నానం



శ్వేతపుష్కరిణిలో అవభృథ స్నానం

గార: శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం వైశాఖ పూర్ణిమ పురస్కరించుకుని శ్వేత పుష్కరిణిలో స్వామివారికి అవభృథ స్నానం జరిగింది. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు ఆధ్వర్యంలో వేదోక్తంగా క్రతువును పూర్తి చేశారు. అనంతరం భక్తులు పవిత్ర స్నానాలాచరించారు. సాయంత్రం వైష్ణవి దుర్గాలయం వద్ద కల్యాణోత్సవంలో తుది కార్యక్రమంగా పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, శ్రీమన్నారాయణ, శ్రీనివాసాచార్యులు, కిషోర్‌బాబు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి



లోకోస్ యాప్‌పై శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాల బలోపేతం, పారదర్శక నిర్వహణ కోసం ప్రతి సంఘం వివరాలను లోకోస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ చింతాడ రామ్మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు ఎచ్చెర్లలోని మండల సమాఖ్య కార్యాలయంలో లోకోస్ యాప్‌లో వివరాల నమోదుపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్‌లో భాగంగా యాప్‌లో వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. సంఘాలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, తీసుకున్న రుణాలు, వాయిదా చెల్లింపులు తదితర వివరాలు అన్నీ ఒకేచోట నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు రామ్మూర్తి, మరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీచక్ర నవారణార్చనలు



అమ్మవారికి హారతులిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని రాజరాజేశ్వరీ లలితా మహాత్రిపురసుందరీ దేవీపీఠంలో పదిరోజులుగా జరుగుతున్న జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ముగింపు సందర్భంగా శుక్రవారం అమ్మవారికి శ్రీచక్ర నవారాణార్చనలు జరిగాయి. అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ, వశిష్ఠ కార్తికేయశర్మ పాల్గొన్నారు.

విశేష అలంకరణలో

విజయదుర్గ



జిల్లా కేంద్రంలోని నానుబాలవీధిలో విజయదుర్గా అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, ఫణిశర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

– శ్రీకాకుళం కల్చరల్